**కథ**

# పావురం

**గన్నవరపు నరసింహమూర్తి**

ప్రత్యూషపు వేళ; తూర్పు సంధ్య ఎర్రబారుతోంది. దూరంగా ఉన్న గుడిలోని గంటలు విరామం లేకుండా మారుమ్రోగుతున్నాయి. ఆ గుడి గంటల శబ్దం వరండాలో పడుకొన్న కామేశం చెవులకి సోకి, అతనికి నిద్రాభంగం అవుతోంది.

అది ఒక లోగిలి. అక్కడ అద్దెకు ఉన్న వాళ్లంతా మధ్య తరగతి వారే. అన్నీ చిన్న చిన్న యిళ్లు. ఆ లోగిలిలో కోడి ముందే కూస్తుంది. డ్యూటీలకెళ్లాల్సిన డ్రైవర్లు, ఎక్కడో మారుమూల పల్లెలకు వెళ్లాల్సిన టీచర్లు స్కూలుకెళ్లాల్సిన పిల్లలకు, భర్తలకు కేరేజీలు రెడీ చేయడానికి వాళ్లకన్నా ముందుగానే లేచే ఆడవాళ్ళు...యిలా ఆ లోగిలి సూర్యోదయానికి చాలా ముందుగానే మేల్కొంటుంది.

అలా ఆ లోగిల్లో ఉండే ఒక యిల్లు రఘురామ్‌ది. అతను, అతని భార్య శ్రీలక్ష్మి యిద్దరూ మున్సిపల్ స్కూల్లో టీచర్లు. వాళ్లకి యిద్దరు పిల్లలు; వాళ్లు ప్రైవేట్ స్కూల్లో చదువుతున్నారు. వాళ్లతోపాటే రఘురామ్ తండ్రి కామేశం స్కూల్లో హెడ్మాస్టర్‌గా రిటైరై వాళ్లతోనే ఉంటున్నాడు. అతని భార్య భానుమతి చనిపోయి మూడేళ్లు కావస్తోంది. అతని భార్య చనిపోవడం, అతను పదవీ విరమణ చేయడం ఒకే సంవత్సరం జరగడంతో రఘురామ్ తండ్రి కామేశాన్ని తమతోటే పట్నం తీసుకొచ్చేసాడు. మొదట్లో ఆ పల్లెను వదలి తను రానని మొరాయించాడు కామేశం. కానీ ఆ ఊళ్లో ఒంటరిగా ఉండటం కష్టం అనీ, చేసేవారు ఎవ్వరూ లేరని చెప్పి బలవంతంగా తీసుకొచ్చేసాడు రఘురామ్.

రఘురామ్ భార్య శ్రీలక్ష్మి తెల్లారి నాలుగు గంటలకు లేస్తుంది. తమకు, పిల్లలకు కేరేజీలకు వంట చేస్తుంది. అలాగే కాఫీలు, స్నానాలకు నీళ్లు, అందరికీ టిఫిన్, ఇంట్లోనే ఉండే మామగారికి మధ్యాహ్న భోజనం...యిలా అన్నీ అప్పుడే తయారుచేస్తుంది. లేచిన దగ్గర్నుంచీ ఒక యంత్రంలా పనిచేస్తుంది. తను, భర్త, పిల్లలూ కలిసి స్కూలుకి ఏడు గంటలకు యింటి నుంచి బయలుదేరేదాకా క్షణం తీరికుండదామెకు.

వాళ్లందరూ వెళ్లిపోయాక యింటిలో ఒంటరిగా వుంటాడు కామేశం. ఆ చిన్న లోగిలిలో ఉన్న ఆ యిరుకు యింటిలో కామేశం రోజంతా వరండాలోనే గడపాలి. అతనితో మాట్లాడ్డానికి అక్కడ అతని వయసువాళ్లు ఎవ్వరూ లేరు. ఆ లోగిలిలో ఉదయం ఎనిమిది తర్వాత అన్ని యిళ్లకు తాళం కప్పలు వేలాడుతుంటాయి.

కామేశానికి కొడుకూ, కోడలు, మనవలు వెళ్లిన తరువాత మొదలవుతుంది కష్టకాలం. పేపరుతో ఓ గంట కుస్తీ పడతాడు. తరువాత కొంచెం సేపు టీవీ చూస్తాడు, కానీ అతనికి కావలసిన కార్యక్రమాలు ఏవీ రావు కనుక వెంటనే దాన్ని ఆపేస్తాడు. కాసేపు వరండాలో పచార్లు చేస్తాడు. ఇంకాసేపు బజారు వైపు వెళ్లి తిరిగొస్తాడు. అయినా సరే అతనికి పొద్దు గడవదు. నిజానికి ఆ యింటిలో అతనికి సమయం గడవదు. క్షణ క్షణానికి వాచీ వైపు జాలిగా చూస్తుంటాడతను.

ఆరోజు కొడుకు కుటుంబం స్కూళ్లకి వెళ్లిన తరవాత వరండాలో వాలు కుర్చీలో కూర్చొని ఆలోచిస్తున్నాడు కామేశం. తను స్కూలు టీచరుగా తమ పల్లెలో పనిచేసిన ఆనందమైన రోజులు అతనికి గుర్తుకొస్తున్నాయి. చిన్నప్పట్నించి తను పుట్టి పెరిగిన పల్లెలోనే తనకు ఎలిమెంటరీ స్కూల్లో టీచరుగా ఉద్యోగం రావడం, తన మేనమామ కూతురు భానుమతితో వివాహం, ఒక్కడే కొడుకు రఘురామ్ పుట్టడం...అన్నీ వరుసగా గుర్తుకొస్తున్నాయ్.

ఆ పల్లెలో జీవనం ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది. తెల్లవారి స్నానానికి ఇంటికి కొద్ది దూరంలో తూర్పు వాహినిగా పారుతున్న ఏటికెళ్లేవాడు. తరువాత యింటికొచ్చి పూజాదుల తర్వాత పిల్లలకు ట్యూషన్లు చెప్పి తొమ్మిది గంటలకు స్కూలుకెళ్లేవాడు. సాయంత్రం స్కూలు నుంచీ వచ్చిన తరవాత మళ్లీ ఏటి ఒడ్డుకు వెళ్లి యిసుక తిన్నెల మీద చల్లగా వీచే మలయ మారుతాన్ని ఆస్వాదిస్తూ చీకటి పడేదాకా గడిపేవాడు. అటువంటిది పదవీ విరమణ సమయానికి భార్య భానుమతి అనారోగ్యంతో చనిపోవడంతో అతని దశ మారిపోయింది. అతనికి కష్టాలు ప్రారంభమయ్యాయి.

ఒక్కగానొక్క కొడుక్కి పెళ్లైపోవడం, అతను, కోడలు దూరంగా పట్నంలో స్కూల్లో ఉద్యోగాలు చేస్తుండడంతో వాళ్లు భానుమతి చనిపోయిన తరవాత వాళ్లతో రమ్మన్నప్పుడు అతను వెళ్లనన్నాడు. తనకిక్కడే హాయిగా ఉంటుందనీ, చిన్నప్పట్నించీ యిక్కడే పుట్టి పెరగడంతో యిప్పుడు తను పట్నం వచ్చి ఉండలేనని చెప్పాడు. కానీ వాళ్లు వినలేదు. ఈ వయసులో ఒంటరిగా పల్లెలో ఉండటం కష్టం అనీ అనారోగ్యం చేస్తే చూసేవాళ్లు ఎవ్వరూ ఉండరనీ చెప్పడంతో అతనికి వెళ్లడం తప్పింది కాదు. అదీగాక ఊళ్లో వాళ్లు కూడా కొడుకుతో పట్నం వెళ్లడమే మంచిదనీ చెప్పడంతో అతనికి పట్నం వెళ్లక తప్పలేదు.

అప్పట్నుంచి అతనికి నరకం ప్రారంభమైంది. మొదట్లో కొద్దిగా ఓర్చుకున్నాడు. కానీ కొద్దిరోజుల తరువాత ఇక అతని వల్ల కాలేదు. అతని కొడుకు, కోడలు చాలా మంచివాళ్లు. అతనిని బాగా చూసుకుంటారు. కోడలైతే గొప్ప ఉత్తమురాలు. ఒక్కనాడూ విసుక్కోదు. అన్నీ అమర్చిపెడుతుంది. కానీ అతని సమస్య అది కాదు. ఈ వయస్సులో ఈ ఊబిలాంటి యింటిలో ఉండలేకపోతున్నాడు. కొడుకు, కోడలు మాత్రం ఏం చేస్తారు? వాళ్ల జీవితాల్ని వాళ్లు సరిదిద్దుకోవాలి కదా! వాళ్ల పిల్లల బాగోగులు వాళ్లు చూస్కోవాలి! తనా కొడుక్కి పెద్దగా ఆస్తేమీ యివ్వలేదు. తన గురించీ వాళ్లు ఉద్యోగాలు మానేసి తనతోపాటు పల్లెలో ఉండలేరు కదా!

ఇక్కడ అతనికి లేనిది స్వేచ్ఛ; బాధపెడుతున్నది ఒంటరితనం. ఇలాగే యిక్కడ కొన్నాళ్లుంటే తనకు పిచ్చెక్కుతుందేమోనని కామేశానికి భయం. వృద్ధాప్యంలో భార్యావియోగం ఎంతటి బాధాకరమో యిప్పుడు స్వయంగా అతను అనుభవిస్తున్నాడు. ఈ బాధ ఎవరికీ రాకూడదని అతను పదే పదే అనుకుంటూ ఉంటాడు. ఎలాగైనా ఈ పరిస్థితి నుంచి బయటపడాలని అతని ఉబలాటం.

ఆ సాయంత్రం రఘురామ్ స్కూలు నుంచి వచ్చిన తరువాత తండ్రితో అన్నాడు. "నాన్నగారూ! నాకు ఈ సంవత్సరం మా స్కూలువాళ్లు ఎల్.టీ.సీ. యిస్తున్నారు. మనమందరం తీర్థయాత్రలకు వెళ్దాం. మీరు కూడా ఉత్తర భారత యాత్రాస్థలాలు చూడలేదు కదా! అందుకే వస్తున్న శనివారం బయలుదేరదాం..మీరు ఊ అంటే రిజర్వేషన్ చేయిస్తాను"


అది విన్న కామేశానికి ఏం చెయ్యాలో తోచలేదు. కాసేపు మౌనం వహించాడు. నిజమే; ఎన్నాళ్లు ఈ పంజరంలాంటి యింట్లో వుంటాడు. ఈ యాత్రల పేరుతోనైనా ఈ యింటి నుంచి బయటపడి బయట ప్రపంచాన్ని చూస్తే కొంతైనా ఉపశమనం కలుగుతుంది. దానివల్ల స్వేచ్ఛగా సంచరించవచ్చు అని అతని ఆలోచన; కొంచెం సేపటి తరువాత "నాకిష్టమే, నేను బయలుదేరతాను" అని కొడుకుతో చెప్పాడు.

ooo

అనుకున్న ప్రకారం ఆ శనివారం రఘురామ్ కుటుంబం అతని తండ్రి కామేశంతో సహా లింక్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరారు. అతని టూర్‌ప్రోగ్రామ్ ప్రకారం ముందు ఢిల్లీ వెళ్లి అక్కడ చుట్టుప్రక్కల తాజ్‌మహల్ అవీ చూసి ఆ తరువాత గయ, ప్రయాగ, కాశీ, బదరీనాద్, కేదారినాద్ అన్నీ చూడాలి.

ముందుగానే రిజర్వేషన్ చేయడం వల్ల అందరూ ఎవరి బెర్త్‌ల్లో వాళ్లు పడుకున్నారు. తెల్లారేసరికి రైలు భోపాల్ చేరింది. మొద్దు నిద్రపోతున్న రఘురామ్‌ని అతని భార్య శ్రీలక్ష్మి లేపింది. కళ్లు నలుపుకుంటూ లేచిన రఘురామ్‌తో "ఏవండీ! మీ నాన్నగారు బెర్త్‌మీద లేరు. టాయిలెట్స్‌లో కూడా చూశాను. ఎక్కడా కనిపించడం లేదు" అంది ఆత్రుతతో.

రఘురామ్ ఒక్క ఉదుటున బెర్త్‌మీంచి లేచి కంపార్ట్‌మెంటంతా వెదకడం మొదలుపెట్టాడు. ఆ కోచే కాకుండా ముందూ వెనుకా మొత్తం కంపార్ట్‌మెంట్లన్నీ వెదికాడు. ప్లాట్‌ఫారమ్ మీద కూడా వెదికాడు. వెతికి వెతికి ట్రైన్ కదిలిపోతున్న సమయానికి తిరిగి వెళ్లిన రఘురామ్‌తో శ్రీలక్ష్మి అతని బెర్త్‌మీద పుస్తకం క్రింద ఈ ఉత్తరం దొరికింది అంటూ ఓ ఉత్తరాన్ని అతనికిచ్చింది. అది కామేశం



కొడుక్కి వ్రాసిన ఉత్తరం. అందులో యిలా ఉంది.

"ప్రియమైన రఘుకి,

మీ నాన్న బాధపడుతూ వ్రాసిన ఉత్తరం. మీ అమ్మ చనిపోయిన తరువాత దాదాపు నేను ఒంటరివాణ్ణయిపోయాను. స్వేచ్ఛగా విహంగంలా మన పల్లెలో బ్రతికిన నాకు ఈ పట్టణం యిరుకు వాతావరణం నరకం చూపించింది. ముఖ్యంగా మీరందరూ స్కూళ్లకు వెళ్లిపోయిన తరువాత నా బాధ ఎవరికి చెప్పుకోను? నోరారా మాట్లాడడానికి కూడా ఎవరూ ఉండేవారు కారు. అంతటా నిశ్శబ్దం. దాదాపు నాకు పిచ్చెక్కేది. ఈ వయసులో గతస్మృతులను నెమరు వేసుకోవాలనీ ప్రతీవారికుంటుంది. అది మన ఊళ్లో అయితే సాధ్యపడుతుంది. కానీ నా దురదృష్టం వల్ల దేవతలాంటి మీ అమ్మ నాకంటే ముందుగా వెళ్లిపోయింది. దానివల్ల తప్పక నీ దగ్గరకు రావలసి వచ్చింది.

రెండేళ్లు యిలాగే గడిచిపోయాయి. కానీ ఈ మధ్యనే నాకు విపరీతమైన ఆలోచనలు వస్తున్నాయ్. ఇక్కడే కనుక నేనుంటే పిచ్చివాడినైపోవడం ఖాయమనిపించింది. దీనికి మిమ్మల్ని తప్పు పట్టను. నిజంగా కోడలు శ్రీలక్ష్మి దేవతే. నన్ను కన్నతండ్రిలా చూసుకుంది. కానీ ఈ వయసులో నాక్కావలసింది వేరు; నేను మన పల్లెలో టీచరుగా పనిచేస్తున్నప్పుడు రోజుకి పద్దెనిమిది గంటలు పిల్లల మధ్యే గడిచిపోయేది. అప్పుడు నాకు క్షణం తీరికుండేది కాదు. కానీ యివాళ ఒక్కక్షణం ముందుకుపోవటం లేదు. తెల్లవారిందంటే నాకు భయం వేస్తోంది. చుట్టూ నాలుగు గోడలు...సూర్యుని వెలుగు కూడా ప్రసరించని యింట్లో ఎన్నాళ్లు ఉండగలను? ఈ జీవితానికి పరమార్థం ఏదైనా ఉందా? ఎందుకీ బ్రతుకు బ్రతకడం? పంజరంలో పావురానికీ నాకూ తేడా ఉందా? అరవై సంవత్సరాలపాటు హాయిగా సాగిపోయిన నా బ్రతుకు ఈ చివరి దశలో యింత విషాదంగా మారుతుందని కలలో కూడా ఊహించలేదు.

అందుకే నేనొక నిర్ణయానికొచ్చాను. నేను కొన్నాళ్లు స్వేచ్ఛగా నా యిష్టానుసారం తిరుగుతాను. పదిమందికి సేవ చేస్తూ ఏ వృద్ధాశ్రమంలోనో గడుపుతాను. అందుకే రాబోయే స్టేషన్లో నేను దిగిపోతున్నాను. నా ఈ నిర్ణయం నీకు, కోడలికి కోపం తెప్పించవచ్చు. కానీ ఈ సమస్యను నా కోణంలోంచి ఆలోచించి చూడు; దయచేసి నాకోసం ఎక్కడా వెతకొద్దు. నేనేమీ చనిపోను. తిరిగి తిరిగి అలసిపోయిన తరువాత నేను మళ్లీ మీ దగ్గరకే వస్తాను. మీ నాన్న ఏదని ఎవరైనా అడిగితే మా పల్లెకు తిరిగి వెళ్లిపోయాడని చెప్పు. నాకు కావలసిన డబ్బుని వస్తున్నప్పుడు బ్యాంకులోంచి డ్రా చేసుకున్నాను. ఈ వయసులో నీకుగాని, కోడలుకిగానీ కోపం తెప్పిస్తే నన్ను క్షమించు. మనవలు జాగ్రత్త.

ఉంటాను.

మీ నాన్న

కామేశం"

ooo

"ఇది జరిగి సంవత్సరం అయింది మావయ్యా! అతను వెతకొద్దన్నా నేనే ఉండబట్టలేక అందరి చుట్టాలకూ ఉత్తరాలు వ్రాసాను. ఢిల్లీ రాదని నీకు ఉత్తరం వ్రాయలేదు. కొన్ని ఆశ్రమాలకు కూడా వెళ్లాను. అయినా అతని జాడ తెలియలేదు" అన్నాడు రఘురామ్ తన మేనమామ మాధవరావ్‌తో. అతని మేనమామ మాధవరావ్ ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఎప్పుడో తన చెల్లి పోయినప్పుడు వచ్చినవాడు మళ్లీ ఈరోజు డ్యూటీమీద విశాఖపట్నం వచ్చి మేనల్లుడింటికి వచ్చాడు. అప్పుడు తన తండ్రి ఏడాది క్రితం చెప్పకుండా వెళ్లిపోయిన సంగతి అతనికి రఘురామ్ చెప్పాడు.

"నిజంగా ఆరోజు చాలా బాధ వేసింది మావయ్యా! సడెన్‌గా మా నాన్న ఎక్కడో చెప్పాపెట్టకుండా దిగిపోవడంలో ఏం చెయ్యాలో నాకు తోచలేదు. దిగిపోయి యింటి కొచ్చెద్దామంటే అప్పటికే భోపాల్ దాటిపోయేం" అన్నాడు రఘురామ్.

"మరి తిరిగి వచ్చేశారా?" అడిగాడు మాధవరావ్.

"ఏదైతే అది అవుతుందని యాత్రలన్నీ చేశాకే వచ్చాం. అతనేం చిన్నపిల్లవాడు కాదు కదా మావయ్యా?"

"ఎప్పుడైనా అతను యిక్కడ ఉండటం యిష్టం లేదనీ నీకు చెప్పాడా?"

'అదేం లేదు మావయ్యా! కానీ ఆయన్ని చూస్తే నాకే బాధనిపించేది. ఆయన మా పల్లెలో మహారాజులా బ్రతికేవాడు. అమ్మ దగ్గరుండీ అన్నీ ఆయనకు అమర్చి పెట్టేది. కానీ మా అమ్మ చనిపోయిన తరువాత అతని పరిస్థితిలో విపరీతమైన మార్పొచ్చింది. విశాలమైన ఆ యింట్లోంచి యిరుకైన ఈ యింట్లో ఉండటం నిజంగా కష్టమే. అతను చాలా ఒంటరితనం అనుభవించాడు. ముఖ్యంగా ఈ వయసులో భార్యా వియోగం చాలా బాధాకరం. ఆయన ఆలోచనల్ని, అనుభూతుల్ని పంచుకునేందుకు సరియైన భాగస్వాములెవరూ యిక్కడ లేకపోవడం కూడా ఆయన వెళ్లిపోవడానికి ముఖ్యకారణం" సుదీర్ఘంగా చెప్పాడు రఘురామ్.

"నువ్వు చెప్పింది నిజమేరా రఘూ! నేను మీ చిన్నప్పుడు వేసవి శలవులకు మీ ఊరు వచ్చినప్పుడు అతని జీవితాన్ని దగ్గరగా చూసేవాడిని. ఆ ఊరివాళ్లకు మీ నాన్నంటే ఎంతో గౌరవం. మహారాజులా బ్రతికేవాడు; అదంతా మా చెల్లి చనిపోవడంతోనే పోయింది"

"పూర్వం కుటుంబం మొత్తం అంతా ఒకే చూరుక్రింద బ్రతికేవారు. కలోగంజో కలిసే త్రాగేవారు. కానీ ఆ రోజులు పోయాయి. మానవ సంబంధాలలో కూడా విపరీతమైన మార్పులొచ్చాయి. వీటిని మీ తరం వాళ్లు జీర్ణించుకోలేకపోతున్నారు మావయ్యా! నాన్న విషయంలోనూ అదే జరిగింది" విచారంగా అన్నాడు రఘురామ్.

"మీ నాన్న యిల్లు వదలిపోయిన విషయం యిక్కడికొచ్చాకే నాకు తెలిసింది. ఇంతకీ అతన్ని వెతికే ప్రయత్నాలు చేస్తున్నావా? లేదా?" మాధవరావ్ మేనల్లుడితో అసహనంగా అన్నాడు.

"ప్రయత్నాలు ఆపలేదు మావయ్యా! కాకపోతే ఆయనే తిరిగి వస్తాడని కొండంత ఆశతో ఎదురుచూస్తున్నాను" అన్నాడు రఘురామ్. ఈలోగా పోస్ట్‌మాన్ 'పోస్ట్' అంటూ ఒక కవర్ని తెచ్చి రఘుకి యిచ్చాడు. అతను ఆ ఉత్తరం ఎక్కడి నుండి వచ్చిందో చూశాడు; అది తన తండ్రి కామేశం వ్రాసిన ఉత్తరం; అది విప్పి చదవసాగాడు. అందులో యిలా ఉంది:

"ప్రియమైన రఘుకి,

మీ నాన్న కామేశం వ్రాయునది. నేను వెళ్లి సంవత్సరం పైగా అయింది. నువ్వు, కోడలు, మనవలు క్షేమం అని తలుస్తాను.

నేను ఆ రోజు ప్రయాణం మధ్యలో దిగిపోయిన తరువాత ఎన్నో ఊళ్లు తిరిగి చివరికి కృష్ణానది ఒడ్డున ఉన్న ఒక వృద్ధుల ఆశ్రమంలో చేరాను. ఆ నది ఒడ్డున ప్రశాంతతకు ఆలవాలమైన వాతావరణంలో ఉన్న ఆశ్రమం నాలాంటి ఎందరో వృద్ధులకు ఒక వరంలాంటిది. ఇక్కడందరూ నాలాంటి వారే. వారందరివీ రకరకాల సమస్యలు. ఆశ్రమంలో చేరిన కొత్తలో సమయం యిట్టే గడిచిపోయేది. పూర్తి స్వేచ్ఛని అనుభవించాను. ఒంటరితనాన్ని మరిచిపోయాను. కానీ రాను రాను నా ఆలోచనా ధోరణిలో మార్పు రాసాగింది.

ఇక్కడ నాలాంటి ఒంటరి వృద్ధులతోపాటు వృద్ధదంపతులు కూడా ఉన్నారు. కొందరు వాళ్ల పిల్లల నిరాదరణకి గురైతే మరికొందరు తమ పిల్లలు అమెరికా వెళ్లిపోవడం చేత చూసే దిక్కులేక ఈ ఆశ్రమంలో చేరినవారు. మరికొందరు పిల్లలు లేక వృద్ధాప్యంలో ఆరోగ్యం సహకరించక యిక్కడికొచ్చినవారు.

నేను గమనించిందేమిటంటే అందరూ ఏదో రకంగా తమ పిల్లలచే నిరాదరణకి గురైనవారే. పిల్లలుంటే వృద్ధాప్యంలో తమ బాగోగులు చూస్తారని ఆశించిన వీళ్లకి వాళ్లు చూపే నిరాదరణ వల్ల జీవితమంటే ఏహ్యభావం కలుగుతోంది.

చివరకు సంవత్సరానికొక్కసారైనా తమను చూడటానికి వస్తారని ఎదురుచూసే వీళ్లకి అక్కడ కూడా నిరాశే. చివరకు క్షేమ సమాచారాల కోసం ఉత్తరాలు కూడా వ్రాయరు. నిజంగా మనుష్యుల మధ్య బంధాలు, ప్రేమలు క్షీణించిపోతున్నాయి.

వీళ్లందర్నీ చూసిన నాకు యిప్పుడు కనువిప్పు కలిగింది. నిజంగా ఈ విషయంలో నేను చాలా అదృష్టవంతుణ్ణి. నా కొడుకు, కోడలు ఆణిముత్యాలు. నన్ను పువ్వుల్లో పెట్టుకొని చూశారు. నేనే ఏదో లేని స్వేచ్ఛకోసం యిలా బయటకొచ్చాను. ఇది నా స్వయంకృతాపరాధం. ఏమైనా ఆరోజు అలా వెళ్లడంవల్ల నాకు ప్రపంచం ఎలా ఉందో చూసే భాగ్యం కలిగింది. ఎందరి జీవితాల్నో దగ్గర్నుంచి పరిశీలించే అవకాశం కలిగింది. ఇప్పుడు నా అంతఃచక్షువులు తెరుచుకున్నాయి.

ఈ విశాల విశ్వంలో మనిషికి స్వేచ్ఛతో పాటు ప్రేమను, ఆప్యాయతలను పంచే తన కుటుంబ సభ్యులు కూడా కావాలని తెలుసుకున్నాను. నావంటి వృద్ధులకు ఈ అవసానదశలో పిల్లలు, మనవల మధ్య జీవితం హాయిగా గడిచిపోతే ఆ మనిషికింకేం కావాలి? ఇప్పుడు నాకు నువ్వు, కోడలు, నా మనవలే ముఖ్యం. మీమధ్యే నా జీవితం కడతేరిపోతే చాలు.

అందుకే మరో వారం రోజుల్లో నేను నీ దగ్గరకు వచ్చేస్తున్నాను. నాకు ఈ విధంగా కళ్లు తెరిపించిన ఆ ఏడుకొండలవాణ్ణి దర్శించుకొని వచ్చేస్తాను.

ఇట్లు
మీ నాన్న
కామేశం"

ఉత్తరాన్ని చదివి, దాన్ని మాధవరావ్‌కి యిచ్చాడు రఘు. ఆ ఉత్తరాన్ని చదివిన మాధవరావ్ "నిజంగా నీలాంటి కొడుకు ఉండటం మీ నాన్న అదృష్టం. ఈ విషయం స్వయంగా మీ నాన్న తెలుసుకున్నాడు. తనకి స్వేచ్ఛ కావాలనీ పంజరంలోంచి ఎగిరిపోయిన పావురంలా వెళ్లిపోయాడు మీ నాన్న. కానీ ఈనాడు స్వేచ్ఛతో పాటు పిల్లల ప్రేమ కూడా కావాలని తెలుసుకున్నాడు. ఇక జీవితంలో మీ నాన్న మిమ్మల్ని వదలి యింకెక్కడికి వెళ్లడు" అన్నాడు.

"అవును మావయ్యా! పల్లెటూళ్లోని మా పాతింటిని కూడా బాగు చేయిస్తాను. ఇకనుంచీ ప్రతీ వేసవి శలవులకు మానాన్నతో సహ మేమందరం ఆ యింట్లో, ఆ పల్లెలోనే గడుపుతాం. దాంతో మా ఊళ్లో ముఖ్యంగా ఆ యింట్లోనే ఉండాలన్న మా నాన్న కోరిక కూడా తీరుతుంది" అన్నాడు రఘు చెమర్చిన కళ్లను తడుచుకుంటూ.

"నువ్వు చెప్పేది చాలా నిజం. ఈసారి వేసవికి నేనూ మీ అత్త కూడా ఆ పల్లెకు వస్తాం. మనందరం వేసవిని హాయిగా గడుపుదాం. అప్పుడే మీ నాన్నని కూడా చూస్తాను" అన్నాడు మాధవరావ్.

వాళ్ల మాటలు విన్న శ్రీలక్ష్మి మనస్సు ఆనందంతో పులకించిపోయింది.

